క్లుప్తంగా...

నిధులు మంజూరు చేయాలని వినతి



ఘట్‌కేసర్: కాచవానిసింగారం పంచాయతీ కాంతి దీప కాలనీలో కమ్యూనిటీ భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని సర్పంచ్ వెంకట్‌రెడ్డితో కలిసి శనివారం మంత్రి మల్లారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు.

ఫైర్ సేఫ్టీపై అవగాహన



ఆస్పత్రి సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఫైర్ అధికారులు

మేడ్చల్‌రూరల్: ఫైర్ సేఫ్టీపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని జిల్లా అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ సతీష్ కుమార్ తెలిపారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ ఆస్పత్రిని శనివారం తన సిబ్బందితో కలిసి సందర్శించారు. అనంతరం యాజమాన్యం, సిబ్బందికి ఫైర్ సేఫ్టీపై అవగాహన కల్పించారు. ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదాలు చోటుచేసుకున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇళ్లలో గ్యాస్ సిలిండర్లు పేలిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆస్పత్రి చైర్మన్ గోపాల్‌రెడ్డి, డీన్ శ్రీనివాస్, డైరెక్టర్ అలీబేగ్, పీఆర్వో దుర్గాప్రసాద్‌రెడ్డి, సురేశ్, అనిల్, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైనేజీ పనుల్లో నాణ్యత తప్పనిసరి

చైర్ పర్సన్ పావనీయాదవ్



డ్రైనేజీ పనులు పరిశీలిస్తున్న చైర్ పర్సన్ పావనీయాదవ్, వైస్ చైర్మన్ మాధవరెడ్డి

ఘట్‌కేసర్: డ్రైనేజీ పనుల్లో నాణ్యత లోపించవద్దని మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీయాదవ్ అన్నారు. మున్సిపాలిటీలోని ఎన్ఎఫ్‌సీనగర్ ఒకటో వార్డులో రూ.12 లక్షలతో నిర్మిస్తున్న డ్రైనేజీ పనులను వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కమిషనర్ వేమనరెడ్డి, స్థానిక కౌన్సిలర్ వెంకట్‌రెడ్డితో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యుద్ధ ప్రాతిపదికన డ్రైనేజీ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

తడి పొడి చెత్తను వేరు చేసి అందించాలి



గౌడవెల్లిలో అవగాహన సదస్సు

మేడ్చల్: తడి పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి డంపింగ్ యార్డులకు తరలించాలని ఎంపీడీఓ పద్మావతి అన్నారు. మండలంలోని గౌడవెల్లిలో స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని పలు సూచనలు చేశారు. ఇప్పటికే తడి పొడి చెత్తను వేర్వేరుగా అందించేందుకు బుట్టలు పంపిణీ చేశారని, ప్రజలు సిబ్బందికి చెత్తను వేరు చేసి ఇవ్వాలన్నారు. కార్మికులు చెత్తను వేరు చేసి సేకరించాలని, లేదంటే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. గ్రామస్తులు సహకరించాలని కోరారు. ఇంటింటికీ తిరిగి అవగాహన కలిపించారు. కార్యక్రమంలో సర్పంచ్ సురేందర్‌ముదిరాజ్, ఉప సర్పంచ్ పెంటమ్మ పాల్గొన్నారు.

ప్రజలకు అవగాహన

కీసర: గ్రామాల్లో ప్రతిరోజూ ఇళ్ల నుంచి తడి–పొడి చెత్తను వేరు చేసి పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందికి అప్పగించాలని కీసర ఎంపీడీఓ నంద కిషోర్ అన్నారు. శనివారం యాద్గార్‌పల్లి గ్రామంలో సర్పంచ్ పుట్టరాజు ఆధ్వర్యంలో స్వచ్ఛ్ సర్వేక్షన్ కార్యక్రమంలో ఈమేరకు గ్రామస్తులకు తడి–పొడి చెత్త వేరుచేసే విధంగా ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మల్లేష్, వార్డుసభ్యులు, గ్రామకార్యదర్శి మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం

- అన్ని రాష్ట్రాల్లో అందించాలనేదే బీఆర్ఎస్ లక్ష్యం
- వివిధ రాష్ట్రాల్లో బీఆర్ఎస్‌కు ప్రజల బ్రహ్మరథం
- మేడ్చల్‌లో మూడోసారి గులాబీ జెండా ఎగరడం ఖాయం
- బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి మల్లారెడ్డి



మాట్లాడుతున్న మంత్రి చామకూర మల్లారెడ్డి

కీసర: అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన తెలంగాణ మోడల్ కోసం దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజలు ఎదురుచూస్తున్నారని మంత్రి మల్లారెడ్డి అన్నారు. శనివారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని మారుతి గార్డెన్‌లో నిర్వహించిన నాగారం మున్సిపాలిటీ బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో మంత్రి మల్లారెడ్డి మాట్లాడారు. తొమ్మిదేళ్లలో సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి–సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయన్నారు. ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్, రైతు బీమా, రైతుబంధు, వ్యవసాయానికి ఉచిత కరెంటు, దళితబంధు ఇలా అనేక పథకాలను అమలు చేస్తున్న కేసీఆర్ త్వరలో దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఈ పథకాలను ప్రజలకు అందించాలన్న లక్ష్యంతో ముందుకెళ్తున్నారన్నారు. ఇందుకోసం కేసీఆర్ టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చి దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో నిర్వహిస్తున్న సమావేశాలకు అక్కడి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. తెలంగాణలో 60లక్షల మెంబర్‌షిప్ ఉన్న బీఆర్ఎస్, మహారాష్ట్ర, కర్ణాటక తదితర రాష్ట్రాలో బీఆర్ఎస్‌లో పెద్ద ఎత్తున ప్రజలు, నేతలు చేరుతున్నారన్నారు. దేశవ్యాప్తంగా బీఆర్ఎస్‌కు వస్తున్న ఆదరణను చూసి బీజేపీ, కాంగ్రెస్‌లు ఓర్వలేకపోతున్నాయన్నారు. ప్రధాన మంత్రి మోదీ, బీజేపీ నేతలు మాటలకే పరిమితం అయ్యారని, ప్రజలకు మేలుచేసే పనులు చేపట్టడం లేదని విమర్శించారు. పబ్లిక్ సెక్టార్లను అమ్మి దేశ సంపదను ఆదానికి బీజేపీ ప్రభుత్వం దోచిపెడుతోందని విమర్శించారు.

కేంద్రం పంటనష్టం ఎందుకివ్వలేదు..?

పేద ప్రజలకు, రైతులకు బీజేపీ చేసిందేమీ లేదన్నారు. 19 రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న బీజేపీ తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలను దమ్ముంటే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇక కాంగ్రెస్ పార్టీ గతంలో పదేళ్ల పాలించి ప్రజలకు ఏమి చేయలేదన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలంతా సీఎం కేసీఆర్‌కు అండగా నిలవాలన్నారు. రాష్ట్రంలో పంట నష్టం కింద రైతులకు రూ.10 వేలు అందజేస్తున్నామని, బీజేపీ కేంద్ర మంత్రి, ఎంపీలు రైతులకు కేంద్రం నుంచి పంట నష్టం ఎందుకు ఇవ్వలేదో ప్రజలకు చెప్పాలన్నారు. మనకు కేసీఆర్‌లాంటి సీఎం ఉండటం అదృష్టమని, రానున్న ఎన్నికల్లో దేశవ్యాప్తంగా బీఆర్ఎస్ సత్తాచాటుతుందన్నారు. మేడ్చల్ నియోజకవర్గంలో నిర్వహిస్తున్న ఆత్మీయ సమ్మేళనాలకు స్పందన లభిస్తుందన్నారు. విపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టే విధంగా బీఆర్ఎస్ కార్యకర్తలు పనిచేయాలన్నారు.

అభివృద్ధికి కోట్ల రూపాయల నిధులు

ప్రభుత్వ పథకాలను అర్హులకు అందించే విధంగా ముందుకు సాగాలన్నారు. నాగారం మున్సిపాలిటీ అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. ఇక్కడి ముస్లింలకు ఈద్గా కోసం ప్రభుత్వ స్థలాన్ని కేటాయిస్తామన్నారు. అదేవిధంగా అర్హులైన నిరుపేదలకు డబుల్‌బెడ్‌రూం ఇళ్లు, స్థలం ఉన్న వారికి ఇళ్లు కట్టుకునేందుకు రూ.3 లక్షలు ఇచ్చే కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు మంత్రి తెలిపారు. సీఎం కేసీఆర్ ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన దళిత బంధు పథకంలో భాగంగా మేడ్చల్ నియోజకవర్గంలో త్వరలో 1100 మందికి ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అభివృద్ధి సంక్షేమంలో దూసుకుపోతున్న మేడ్చల్ నియోజకవర్గంలో మూడోసారి గులాబీ జెండా ఎగరడం ఖాయమన్నారు. సమావేశంలో నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, డీసీఎంఎస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు తేళ్ల శ్రీధర్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

భూ'సర్వే' మాయ!

- వాస్తవ పరిస్థితికి భిన్నంగా నివేదికలు
- ఉన్నతాధికారుల నిర్లక్ష్యం
- క్షేత్రస్థాయి సిబ్బంది ఇష్టారాజ్యం
- తప్పుల తడకగా ల్యాండ్ సర్వే విభాగం నివేదికలు

సాక్షి, మేడ్చల్ జిల్లా: భూ సర్వే సిబ్బంది మాయాజాలంతో విలువైన భూముల లెక్కలు తారుమారు కావడం విస్మయానికి గురిచేస్తోంది. ఒక ప్రాంతంలోని ఒక స్థలాన్ని వేర్వేరుగా ఇద్దరు సిబ్బంది సర్వే చేసి భూకొలతలపై భిన్నంగా నివేదికలు అందజేయడం అనుమానాలకు తావిస్తోంది. కొందరికి ప్రయోజనం చేకూర్చేలా, మరి కొందరికి నష్టం కలిగించేలా చేతివాటం ప్రదర్శించడం ఆందోళన గురి చేస్తోంది. భూసర్వే కొలతల అక్రమాలపై ఆరోపణలు, ఫిర్యాదులు వెల్లువెత్తున్నా సంబంధిత అధికారులు వ్యవహరిస్తున్న తీరు నవ్విపోదురుగాక నాకేంటి సిగ్గు అన్న చందంగా తయారైంది. భూసర్వే కొలతల వ్యవహారంలో భారీగా చేతులు మారుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఏళ్ల తరబడి తిష్ట వేసిన ఒక అధికారి నిర్లక్ష్యం, అసమర్థత కారణంగానే భూసర్వే వ్యవహారంలో అవకతవకలు చోటు చేసుకుంటున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

- వివాదాస్పద భూములకు సైతం క్లీన్ చీట్ ఇవ్వడం.. మరోవైపు కొలతల రిపోర్టునకు భారీగా వసూలు చేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు.
- అల్వాల్ మండలంలోని యాప్రాల్ ప్రాంతంలో 198 సర్వే నంబరులో 2015లో ఒకసారి, 2017లో మరోసారి భూసర్వే చేసినా అప్పటి మండల సర్వే సిబ్బంది 10 గుంటల స్థలం ఉందని పేర్కొంటూ సర్వే నివేదిక అందజేశారు. అదే స్థలాన్ని తాజాగా 2023 మార్చిలో 30 గుంటల స్థలంగా పేర్కొంటూ కొలతల నివేదిక సమర్పించడం అనుమానాలు కలిగిస్తోంది. ఈ వ్యవహారంలో భారీగా చేతులు మారినట్లు తెలుస్తోంది.
- దుండిగల్ రూరల్ పరిధిలోని గాగిలాపూర్ 214 సర్వే నంబర్ సంగారెడ్డి– మేడ్చల్ జిల్లాల పరిధిలో ఉంటుంది. ఇక్కడ రెండు ఎకరాల స్థలాన్ని తప్పుడు కొలతలతో ఏకంగా హద్దులు మార్చి వేశారు. ఈ వ్యవహారంలో ఇప్పటికే కుదిరిన ఒప్పందంలో భాగంగా కొంత మాత్రమే ముట్టడంతో నివేదిక సమర్పించడంలో కాలయాపన సాగుతున్నట్లు తెలుస్తోంది.
- ఉప్పల్ మాజీ ప్రజాప్రతినిధి నాగోల్ విలేజి సమీపంలో సర్వే నంబర్ 124లోని ఓ ప్లాట్ విషయంలో నివేదిక ఇవ్వాలని భూసర్వే ల్యాండ్ విభాగంలో సంప్రదించగా, భారీ మొత్తంలో డబ్బులు డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. రూ.2 లక్షలు ముట్టజెప్పినా.. మరింత ఇస్తేనే లైన్ క్లియర్ చేస్తానని చెప్పడంతో సదరు మాజీ ప్రజాప్రతినిధి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది.
- దుండిగల్ మండలలోని సాయినాథ్ సొసైటీలో స్థలాల వివాదం కోర్టులో ఉన్నప్పటికీ కొన్ని స్థలాలకు పట్టా పాస్ పుస్తకాలు జారీ చేయడం అనుమానాలకు తావిస్తోంది.



నేడు మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ



ప్రారంభానికి సిద్ధమైన 26 అడుగుల అంబేడ్కర్ విగ్రహం

మేడ్చల్: గుండ్లపోచంపల్లి మినీ ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసిన మహనీయుల విగ్రహాలను ఆదివారం ఆవిష్కరిస్తున్నట్లు విగ్రహాల దాత, నిర్మాణ దాత మాజీ సర్పంచ్ బేరి ఈశ్వర్ తెలిపారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట 26 అడుగుల అంబేడ్కర్ విగ్రహం, మినీ ట్యాంక్ బండ్‌పై పీవీ నర్సింహరావు, సి.నారాయణరెడ్డి, జయశంకర్, జగ్జీవన్‌రాం, వివేకానంద, జ్యోతిబాపూలే, చాకలి ఐలమ్మ, ఝాన్సీలక్ష్మీబాయి, కొమురంభీం, ఎన్టీఆర్, గ్రామ మొదటి సర్పంచ్ కొండా వెంకట్రాంరెడ్డి విగ్రహాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర మాజీ గవర్నర్ సుశీల్‌కుమార్ షిండే, మంత్రులు మల్లారెడ్డి, కొప్పుల ఈశ్వర్, ప్రజాగాయకుడు గద్దర్, మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు అద్దంకి దయాకర్, సినీ నటుడు మోహన్‌బాబు, ఇతర ప్రముఖులు హాజరవుతారని ఆయన తెలిపారు. సాయంత్రం 6 గంటల నుంచి గాయకుడు గద్దర్ నేతృత్వంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

శ్రీనిధికి అనుమతి లేదంటూ ధర్నా

పోచారం: యమ్నంపేట్‌లోని శ్రీనిధి యూనివర్సిటీపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలంటూ ఏబీవీపీ కార్యకర్తలు శనివారం ధర్నా నిర్వహించారు. అనుమతి లేకుండా యూనివర్సిటీ కొనసాగుతోందని ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. ధర్నా చేస్తున్న కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకొని ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఫైన్ ఆర్ట్స్ స్కూల్లో ముగిసిన వేసవి శిబిరం



విద్యార్థులను అభినందిస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: ఏదులాబాద్‌లోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ ఫైన్ ఆర్ట్స్ స్కూల్లో 15 రోజులుగా నిర్వహించిన వేసవి ప్రత్యేక శిబిరం శనివారం ఘనంగా ముగిసింది. వేసవి ప్రత్యేక శిబిరంలో గాత్రం, కూచిపూడి నృత్యం, తబలా, కీ బోర్డు, గిటార్ తదితర అంశాల్లో శిక్షణ ఇచ్చారు. ముఖ్యఅతిథిగా జిల్లా విద్యాధికారిని విజయకుమారి, ఎంపీపీ సుదర్శన్ రెడ్డి హాజరై ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, జ్ఞాపిక అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మధులత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా నూకాంబిక ఘటం ఊరేగింపు



అమ్మవారి ఊరేగింపు సేవలో మహేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని నూకాంభింక అమ్మవారి జాతర మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం అమ్మవారి ఘటాల ఊరేగింపు వైభవంగా సాగింది. గ్రామ పురవీధుల్లో అమ్మవారిని ఊరేగించగా మహిళలు బోనాలు సమర్పించారు. ఉత్సవాల్లో బీఆర్ఎస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి చామకూర మహేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మిశ్రీనివాస్‌రెడ్డి, స్థానిక కౌన్సిలర్ దొడ్ల మల్లిఖార్జున్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఊరేగింపు సేవలో పాల్గొన్నారు.

వివాహానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, నాగరాణి

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ సాయిగణేష్ కాలనీకి చెందిన మహ్మద్ ఫాతిమా కుమార్తె నసీనా వివాహానికి డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, ఆయన సతీమణి నాగరాణి రూ.5 వేల నగదు, చీరను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సేవ చేయడంలోనే ఆనందం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మహిళా నాయకురాలు వసంత తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో జాగ్రత్తలు పాటించాలి



కల్వర్టు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: చిన్న చర్లపల్లి – రాంపల్లి రోడ్డులో జరుగుతున్న కల్వర్టు నిర్మాణం నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అధికారులకు సూచించారు. శనివారం ఆమె ఇంజినీరింగ్ అధికారులతో కలిసి కల్వర్టు పనులను పరిశీలించారు. వర్షాకాలం మొదలు కావడానికి ముందే కల్వర్టు పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. అలాగే పని జరిగే చోట హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేసి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించి పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమలో ఏఈ స్వరూప, బీఆర్ఎస్ నాయకులు నాగిళ్ల బాల్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, ముత్యాలు, శేఖర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలను ఉపేక్షించేది లేదు



ఘట్‌కేసర్: చౌదరిగూడ పంచాయతీ పరిధిలోని కాలనీల్లో చేపట్టిన పలు అక్రమ కట్టడాలను కార్యదర్శి గౌతమి పంచాయతీ సిబ్బందితో శనివారం కూల్చివేయించారు. అనుమతి లేకుండా నిర్మించిన ఇళ్ల యజమానులకు నోటీసులిచ్చి కూల్చివేయించినట్లు కార్యదర్శి పేర్కొన్నారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి గౌతమి మాట్లాడుతూ పంచాయతీలో అనుమతి లేని కట్టడాలను ఉపేక్షించేది లేదని, ఎంతటి వారైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

కిక్ బాక్సింగ్‌లో స్వర్ణం సాధించిన మల్లెల హర్ష



బోడుప్పల్: బోడుప్పల్‌కు చెందిన మల్లెల హర్ష మంచిర్యాలలో జరిగిన రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో స్వర్ణ పతకం సాధించారు. ఝార్ఖండ్‌లోని రాంచీలో జరగబోయే జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపికైనట్లు తెలంగాణ కిక్ బాక్సింగ్ టీం కోచ్, మేడ్చల్ జిల్లా కిక్ బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.రాజు వెల్లడించారు. శనివారం మంత్రి చామకూర మల్లారెడ్డి, బోడుప్పల్ 13వ డివిజన్ కార్పొరేటర్ దానగల్ల అనిత యాదగిరి హర్షను అభినందించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో గెలుపొందేందుకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు.

పేద విద్యార్థులకు అండగా ఉంటాం

బోడుప్పల్: పేద విద్యార్థులకు తనవంతు సహకారం అందిస్తూ అండగా ఉంటామని 5వ డివిజన్ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి అన్నారు. భీంరెడ్డినగర్‌లోని ముగ్గురు పేద విద్యార్థులకు ఆయన నోట్‌బుక్స్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పుస్తకాలతో పాటు వారికి ఆర్థిక సహాయ సహకారాలు అందిస్తానన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ చదువుకుని ఉన్నత స్థితికి చేరుకోవాలన్నారు.

రూ.70 లక్షల నల్లా బిల్లులు మాఫీ



మంత్రి మల్లారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మేడ్చల్ రూరల్: హెచ్ఎండబ్ల్యూఎస్ పరిధిలో ఉన్న గుండ్లపోచంపల్లిలో నల్లా బిల్లుల పెంపు, అధిక బిల్లులను రద్దు చేయాలని కోరుతూ మున్సిపల్ కౌన్సిలర్లు మంత్రి మల్లారెడ్డి, అధికారులకు వినతి పత్రం అందజేయడంతో మంత్రి ఆదేశాలతో అధికారులు బిల్లులు రద్దు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపల్ ఏర్పడినప్పుడు ఉన్న నల్లా బిల్లుల మాదిరిగానే ప్రస్తుతం తీసుకోవాలని, పెంచిన బిల్లులు ప్రజలకు భారంగా మారాయని, వాటిని రద్దు చేయాలని కోరుతూ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు మంత్రి మల్లారెడ్డికి వినతి పత్రం అందజేశారు. మంత్రి ఆదేశాలతో బిల్లులు రద్దు చేయాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. మున్సిపల్‌లో బకాయి ఉన్న రూ.70 లక్షల నల్లా బిల్లులు మంత్రి ఆదేశాలతో మాఫీ అయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మద్దుల శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు జైపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వీడని బాలుడి మృతి మిస్టరీ



సంతోష్(ఫైల్)

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్సిపాలిటీ కొండాపూర్ మంగలివాని కుంటలో ఈ నెల 3న తల్లి లక్ష్మీ, అత్త వరలక్ష్మితో బట్టలు ఉతికేందుకు వచ్చిన బాలుడు పల్లపు సంతోశ్(12) అదృశ్యమయ్యాడు. కుంటలో కనిపించకుండాపోయాడని తల్లి, అత్త ఇచ్చిన సమాచారంతో రెండు రోజుల పాటు రాచకొండ విపత్తు నివారణ బృందం, ఫైర్, జీహెచ్ఎంసీ, గజ ఈతగాళ్లు వెతికినా ఆచూకీ లభించకపోవడం, శవం కుంటలో తేలకపోవడంతో పరిసర ప్రాంతాల్లో వెతుకుతుండగా ఈ నెల 5న కుంటకు 300 మీటర్లు దూరంలోని ఓ వెంచర్ డ్రైనేజీ మ్యాన్‌హోల్‌లో శవం లభ్యమైంది. శరీరంపై గాయాలు లేకున్నా బాలుడి మరణంపై బంధువులు అనుమానం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో మృతుడి మేనమామ, ఆయన ఇద్దరి స్నేహితులను అదుపులోకి తీసుకొని విచారించినా కేసులో పురోగతి కనిపించలేదు. మృతుడి తండ్రి హత్య కేసులో సంతోష్ తల్లి నిందితురాలిగా ఉందని, ఆమె పైనే బంధువులు, కులస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడి తల్లి ఫోన్ కాల్ డేటా లభిస్తే కేసు కొలిక్కి వచ్చే అవకాశముందని పోలీసులు భావిస్తున్నారు. తల్లి ఫిర్యాదు మేరకు మొదట అదృశ్యం కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహం లభించిన అనంతరం అనుమానాస్పద కేసుగా నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్ జోడో యాత్రకు స్పందన



అంబేడ్కర్‌నగర్‌లో పాదయాత్ర చేస్తున్న డీసీసీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్

అల్వాల్: కాంగ్రెస్ నిర్వహిస్తున్న హాథ్ సే హాథ్ జోడో అభియాన్ యాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని కాంగ్రెస్ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ అన్నారు. శనివారం వినాయక్‌నగర్ డివిజన్‌లోని అంబేడ్కర్ నగర్, శివనగనర్ తదితర ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ఇంటింటికీ తిరుగుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వంటగ్యాస్ రూ.500లకే ఇస్తామన్నారు. 80 గజాల ఇంటి స్థలం ఉండే నిర్మాణానికి రూ.5 లక్షల వరకు రుణం ఇస్తామన్నారు. నిరుద్యోగులకు 2 లక్షల ఉద్యోగాలు, ఆరోగ్యశ్రీ రూ.5 లక్షల వరకు పెంచుతామన్నారు. కార్యక్రమంలో మల్కాజిగిరి బీ బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షుడు సంతోష్‌ముదిరాజ్, మీడియా కన్వీనర్ గుత్తి రాంచందర్, ఎఆర్.శ్రీనివాస్ యాదవ్, సాయికుమార్, దుర్గాసాయి, నరసింహగౌడ్, గిరి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



సాంస్కృతిక సంబురం

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో శనివారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. నాట్యరత్న రమణి సిద్ధి ఆధ్వర్యంలో నెలనెలా కళారాధన కార్యక్రమంలో ఇందిరా పరాంకుశం శిష్య బృందం నిర్వహించిన కర్ణాటక గాత్ర కచేరి మైమరపించింది. పలు అంశాలను సాహితీ భరద్వాజ్, శ్రీహిత, దర్శిని, శ్రియ చార్వి, యజ్ఞశ్రీ గీతికా తదితరులు మెప్పించారు.